# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 29, జనవరి 2026


గనులు మూసి వేయబడిన ప్రాంతాల

## అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు

✪ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి





**నస్పూర్, జనవరి 28, ప్రభాతవార్త**

బొగ్గు గనులు మూసి వేయబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బొగ్గు గనులు సంబంధిత జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అన్ని బొగ్గు కంపెనీల జనరల్ మేనేజర్లతో మైన్స్ క్లోజింగ్ యాక్టివిటీలపై తీసుకోవలసిన చర్యల గురించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ గనులు మూసివేసిన తర్వాత సంబంధిత ప్రాంతాలను స్థిరీకరించి సామాజిక అభివృద్ధి చర్యలు చేపట్టాలని తెలిపారు. మైన్స్ క్లోజింగ్ యాక్టివిటీ లలో భాగంగా పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడం, క్రీడా ప్రాంగణాలు నిర్మించడం, పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడం వంటి చర్యలు తీసుకోవాలని, గనుల మూసివేతకు ముందు, తరువాతకు ఆయా ప్రాంతాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు, ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అప్ లోడ్ చేయాలని, మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మైనింగ్ చేయడం ద్వారా సంబంధిత ప్రాంతాలలో ప్రకృతి దెబ్బతింటుంది అనే భావనను ప్రజలలో తొలగించాలని, మైనింగ్ ప్రభావిత ప్రాంతాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో మూసి వేయబడిన గనుల ప్రాంతంలో హాస్పటల్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఇండస్ట్రియల్ పార్క్ వంటివి మిగతా 2లో..



## సర్వే రిపోర్ట్ల ఆధారంగా సీట్ల కేటాయింపు

* ఎంత మంది టికెట్ ఆశించిన బిఫామ్ ఒక్కరికే

* కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కొరకు సమిష్టి గా కృషి చేయాలి : మంత్రి జూపల్లి

**రామకృష్ణాపూర్,జనవరి 28, ప్రభాతవార్త**

క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్త లు,నాయకులు,ప్రచారం చేయాలని కాంగ్రెస్ పార్టీ సర్వేల ఆధారంగా మున్సిపాలిటీ ఎన్నికల్లో సీట్లు కేటాయిస్తామనితెలంగాణ పర్యాటక,అబ్కారీ శాఖ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జ్ జూపల్లి కృష్ణా రావు అన్నారు. బుధవారం పట్టణంలోని సూపర్ బజార్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థు లు గా పోటీ చేయాలనుకుని టికెట్ ఆశించే ఆశావాహులు, 22 వార్డుల ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. స్థానిక మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కార్మిక శాఖ మంత్రి డా.జి.వివేక్ మిగతా 2లో..

## పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

● కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్

● కాగజ్నగర్ పరిధిలోని చెక్పోస్టుల తనిఖీ



**కాగజ్నగర్ రూరల్, జనవరి 28, ప్రభాతవార్త :**

పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల నామినేషన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తును జిల్లా ఎస్పీ పరిశీలించారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం నుండి కాగజ్నగర్ పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంను, డీఏవి పబ్లిక్ స్కూల్ నందు ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ మిగతా 2లో..

## ఎన్నికల ప్రక్రియలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలి

* మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జనవరి 28, ప్రభాతవార్త**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల మిగతా 2లో..



## విషాదం నింపిన భక్తి ప్రయాణం



మేడారం జాతరకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురు మృతి



**కౌటాల, జనవరి 28, ప్రభాతవార్త:**

రోడ్డు ప్రమాదంలో తల్లి కూతురు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే భూపాలపల్లి జిల్లా మహా ముత్తారం మండలం బోర్ల గూడెం వద్ద మంగళవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తాపడడంతో కొమురంభీం జిల్లా కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన కస్తూరి సునీత( 45 )కస్తూరి అక్షిత (21) లు అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లేందుకు ముందుగా మహాదేవపూర్ మండలం బొమ్మపూర్ గ్రామంలోని బంధువుల ఇంటికి కస్తూరి రమేష్ అతని భార్య సునీత కూతురు అక్షితలు వెళ్లారు.అక్కడి నుండి బంధువులతో కలిసి మంగళవారం సాయంత్రం మేడారం జాతరకు ట్రాక్టర్లో బయలుదేరారు. మహా ముత్తారం మండలం బోర్ల గూడెం వద్ద ట్రాక్టర్ ప్రమాదానికి గురైంది ఈ ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడి కస్తూరి సునీత, కస్తూరి అక్షి త ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయారు.స్థానికుల సహాయంతో పోలీసులు ట్రాలీ లేపి మిగతా 2లో..

## విషాదం నింపిన భక్తి ప్రయాణం

(మొదటిపేజీ తరువాయి)

చూసేసరికి తల్లి కూతురు అక్కడికక్కడే మృతి చెంది ఉన్నారు . కస్తూరి రమేష్ కు కాలు విరగడంతో పాటు గాయాలయ్యాయి అతనితోపాటు మరో 20 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. జాతరలో అమ్మవార్లను దర్శించుకునేందుకు ఎంతో భక్తి శ్రద్ధలతో వెళ్లిన కుటుంబంలో ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి కున్నాయి.

## గనులు మూసి వేయబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మూసివేయబడిన గనుల పరిసర ప్రాంతాల్లో సామాజిక అభివృద్ధి కొరకు 115 కోట్ల రూపాయలు జిల్లాకు కేటాయించడం జరిగిందని, ఈ నిధులు గనులు మూసి వేయబడిన ప్రాంతాలలో వినియోగించి అభివృద్ధి కార్యక్రమాలు అమలు అయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, గనులు భూగర్భ శాఖ ఎ.డి. జగన్ మోహన్, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్ ఏరియా ఇన్చార్జి జి.ఎం. సిహెచ్. వెంకటేశ్వర్లు, ఎస్టేట్స్ మేనేజర్లు వరలక్ష్మి, సింగరేణి పర్యావరణ విభాగం అడిషనల్ మేనేజర్ హనుమాన్ గౌడ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్, కౌంటింగ్ కేంద్రంను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నామినేషన్ సెంటర్ల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్ సెంటర్ దగ్గరలో 100 మీ.ల లోపు నిషేధిత ఉత్తర్వులు అమలులో ఉంటాయని, ఇతరులను అనుమానించవద్దని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఎస్పీ సూచించారు. అనంతరం మున్సిపల్ ఎన్నికలలో భాగంగా కాగజ్‌నగర్ పరిధిలో ఏర్పాటుచేసిన బట్పల్లి ఎక్స్ రోడ్, అగ్రికల్చర్ (వినయ్ గార్డెన్ దగ్గర) చెక్ పోస్ట్ లను తనిఖీ చేసి, చెక్ పోస్ట్ ల వద్ద అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని అక్కడి సిబ్బందికి సూచించారు, ఎన్నికల ప్రవర్తన నియమాల్ని ఉల్లంఘించే చర్యలను అరికట్టాలని, పలు విషయాలు సూచించారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్,కాగజ్‌నగర్ టౌన్ సీఐ ప్రేమ్ కుమార్, కాగజ్ నగర్ రూరల్ సీఐ కుమారస్వామి, తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఎన్నికలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని వేగంగా, పారదర్శకంగా మీడియాకు అందించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్ఓ) కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ మొత్తం నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా మీడియా సెంటర్ కీలక భూమిక పోషిస్తుందని పేర్కొన్నారు. అభ్యర్థుల వివరాలు, నామినేషన్లు, పోలింగ్ సరళి, ఓట్ల లెక్కింపు తదితర ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని అధికారిక సమాచారం ఈ సెంటర్ ద్వారా మీడియాకు అందజేస్తామని తెలిపారు. డీపీఆర్ఓ విష్ణువర్ధన్ మీడియా సెంటర్ నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్,సాధారణ ఎన్నికల పరిశీలకులు డి. హనుమంత్ నాయక్, వ్యయ పరిశీలకురాలు ఎల్. విజయ, మీడియా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఎన్నికల ప్రక్రియలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలి

(మొదటిపేజీ తరువాయి)

స్వీకరణ కేంద్రాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.అన్వేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ లతో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించిన అనుభవంతో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు సంబంధించి అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలోగా స్వీకరించాలని, 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఉన్న వారి నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారిని అనుమతించడం జరగదని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కొరకు టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సర్వే రిపోర్ట్‌ల ఆధారంగా సీట్ల కేటాయింపు

(మొదటిపేజీ తరువాయి)

నేతృత్వంలో, మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో కోర్ కమిటి వేసినట్లు తెలిపారు. అభ్యర్థుల ఎంపికకు పార్టీ తరపున ఒక కమిటీ,మంత్రి వివేక్ ఆధ్వర్యంలో మరో కమిటీలు వేశామని, రెండు కమిటీల సర్వే రిపోర్ట్ ల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు.ఎంత మంది టికెట్ ఆశించిన ఒకరికే బీ ఫామ్ వస్తుందని అన్నారు. టికెట్ ఆశించి, రాని వారు నిక్కచ్చిగా అభ్యర్థి కోసం గాక కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.చేయి గుర్తు కు ఓటు వేసి క్యాతన్‌పల్లి పుర పీఠం పై కాంగ్రెస్ జెండా ఎగురిసేందుకు కార్యకర్తలు, నాయకులు ప్రచారం చేయాలని కోరారు.

### పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు..

మున్సిపాలిటి ఎన్నికల్లో సీట్లు ఆశించి, రాని వారు, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ లైన్ దాటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఓటమికి, ఇతర పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం పని చేసినట్లు రుజువైతే పార్టీ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ మరో మూడు ఏండ్లు అధికారం లో ఉంటుందని, అధికార వర్గాలు,పోలీస్ అధికారులు కాంగ్రెస్ ఆదీనం లోనే పని చేస్తాయని కాంగ్రెస్ పార్టీ నాయకులకు పరోక్ష హెచ్చరిలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, క్యాతన్ పల్లి మున్సిపాలిటి ఎన్నికల కోర్ కమిటి సభ్యులు అబ్దుల్ అజీజ్, గాండ్ల సమ్మయ్య, నీలం శ్రీనివాస్ గౌడ్, మహంకాళి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డిలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న నయీమ్ పాషా

## ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థులను గెలిపించండి: నయీమ్ పాషా

### - ప్రజా సమస్యలే ఎజెండాగా పోరు

**నస్పూర్, జనవరి 28, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నయీమ్ పాషా పిలుపునిచ్చారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఆప్ కట్టుబడి ఉందని అన్నారు. కార్పొరేషన్ పరిధిలో వీధి దీపాలు, రహదారుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, రిటైర్డ్ సింగరేణి ఉద్యోగులకు రేషన్ కార్డులు అందడం లేదని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన దరఖాస్తులు చేసుకోవడానికి వెబ్‌సైట్ సక్రమంగా పనిచేయడం లేదని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు లేక స్థానిక యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అభ్యర్థిగా అనపర్తి యువరాజ్, 17వ డివిజన్ అభ్యర్థిగా దొమ్మటి రవికుమార్, 50వ డివిజన్ అభ్యర్థిగా షహానా పోటీలో ఉంటారని ప్రకటించారు. ఆప్ అభ్యర్థులను గెలిపిస్తే వార్డుల్లో నెలకొన్న మౌలిక వసతుల కొరతను తీరుస్తామన్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ నగర్‌లోని పాత కలెక్టరేట్ భవనాన్ని ఎస్సీ బాలికల హాస్టల్‌కు కేటాయించేలా కృషి చేశామని గుర్తు చేశారు. ఆండాలమ్మ కాలనీ డంపింగ్ యార్డ్ తరలింపుపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ ముందుకు సాగుతుందని నయీమ్ పాషా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంటు రాజేందర్, సభ్యుడు కుమారస్వామి, అభ్యర్థులు యువరాజ్, రవికుమార్, షహానా పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మ జాతరను దిగ్విజయం చేయాలి

### - శ్రీరాంపూర్ ఇంచార్జ్ జీఎం ఎన్. సత్యనారాయణ

### - శ్రీ ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద సారలమ్మకు ప్రత్యేక పూజలు

**నస్పూర్, జనవరి 28, ప్రభాతవార్త**

సమ్మక్క సారలమ్మ జాతరను దిగ్విజయం చేయాలని శ్రీరాంపూర్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ ఎన్. సత్యనారాయణ పిలుపునిచ్చారు. శ్రీ ముక్కిడి పోచమ్మ ఆలయం వద్దకు కంకవనం నుండి సారలమ్మ దేవతను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో భక్తుల కోసం అన్ని వసతులు ఏర్పాటు చేసిన వివిధ విభాగాల అధికారులను అభినందించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పుర ప్రజల పైన దేవతల ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. చుట్టుపక్కల పరిసర ప్రాంతాల ప్రజలు ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద ఉన్న సమ్మక్క సారలమ్మ దేవతలను దర్శించుకోవాలని కోరారు. ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ సత్యనారాయణ, అరుణ దంపతులు ఈ వేడుకలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆలయ పూజారి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఆర్.కె 7 గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్, ఇందారం ఓసీపీ పీవో ఏ. వెంకటేశ్వర రెడ్డి, ఏరియా సెక్యూరిటీ అధికారి జక్కా రెడ్డి, అధికారులు ఎస్. సురేందర్, మురళి, ఏఐటీయూసీ నాయకులు ముస్కే సమ్మయ్య, కొట్టే కిషన్ రావు, సేవ కార్యదర్శి కొట్టే జ్యోతి తదితరులు పాల్గొన్నారు.





## గడ్డంగూడలో పదహారు గుడిసెల తొలగింపు

**జన్నారం, జనవరి 28, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా జన్నారం రేంజ్ గడ్డంగూడలో అటవీ భూమిలో నిర్మించిన పదహారు గుడిసెలను అటవీ అధికారులు తొలగించారు. దేవునిగూడెం పంచాయతీ లక్ష్మీపూర్ తండాకు చెందిన గిరిజనులు గత ఇరవై ఏళ్లుగా ఈ అటవీ భూమిలో గుడిసెలు వేస్తున్నారు. అధికారులు ప్రతి ఏటా వీటిని తొలగిస్తున్నారు. ఆరు నెలల కిందట ఒకసారి తొలగించినా, నెల రోజులు తిరగకముందే మళ్లీ అక్కడ గుడిసెలు నిర్మించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం అటవీ అధికారులు జెసిబి సహాయంతో ఆ నిర్మాణాలను పూర్తిగా తొలగించారు.

### మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో

# అప్రమత్తంగా వ్యవహరించాలి

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**బెల్లంపల్లి, జనవరి 28, ప్రభాతవార్త**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జె.సంపత్‌తో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులకు సంబంధించి అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలోగా స్వీకరించాలని, 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఉన్నవారి నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారి నుండి స్వీకరించడం జరగదని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కొరకు టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, 100 మీటర్ల నిబంధన అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి



11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736 250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



## ఆర్.కె.1ఏ జాతరలో కొలువు దీరిన సారలమ్మ తల్లి

**రామకృష్ణాపూర్, జనవరి 28, ప్రభాతవార్త**

సింగరేణి యాజామాన్యం మందమర్రి ఏరియా రామకృష్ణపూర్ పట్టణంలోని ఆర్.కె.1ఏ గని సమీపంలోని పాల వాగు ఒడ్డున ప్రతి రెండేండ్లకోసారి నిర్వహించే సమ్మక్కసారాలమ్మ జాతర ప్రారంభం అయింది. బుధవారం రాత్రి 6:30 గంటలకు సారాలమ్మ గద్దె పై కొలువు దీరింది. మధ్యాహ్నం మూడు గంటలకు మందమర్రిలోని దూలం కనకయ్య ఇంటి నుండి సారాలమ్మ తల్లి ని మందమర్రి పుర వీధుల గుండా, గోదావరి ఖని వైపు పాకిస్థాన్ క్యాంపు మార్గం గుండా, ఆర్.కె.1ఏ గని కి వెళ్లే రహదారి నుండి డప్పు చప్పుళ్ల తో, శివ సత్తుల పునకాలతో ఊరేగింపు గా సారాలమ్మ తరలి రాగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. మందమర్రి ఏరియా జి.ఎం రాధాకృష్ణ దంపతులు, బెల్లంపల్లి ఏ.సి.పి రవి కుమార్, మందమర్రి సీ.ఐ రమేష్, పట్టణ ఎస్ఐ శ్రీధర్‌లు అమ్మ వారిని దర్శించుకొని మొక్కులు సమర్పించారు.

## బోథ్‌లో ఉత్సాహంగా జిల్లా స్థాయి బాలికల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ ప్రారంభం

**ఆదిలాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:**

ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల క్రీడా ప్రాంగణం బుధవారం ఉత్సాహంతో కళకళలాడింది. జిల్లా స్థాయి బాలికల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్-2026 కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లెపూల నర్సయ్య, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్ పాల్గొన్నారు. వేడుకల ప్రారంభ సందర్భంగా అతిథులు జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి విద్యార్థినుల గౌరవ వందనం స్వీకరించారు. శాంతి, ఐక్యతకు ప్రతీకగా హైడ్రోజన్ బెలూన్లను ఆకాశంలోకి ఎగురవేయడంతో క్రీడాకారిణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడం గర్వకారణమన్నారు. క్రీడాకారిణులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని, ప్రతి విద్యార్థిని క్రీడా స్ఫూర్తితో పాల్గొని తన ప్రతిభను చాటుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు విద్యార్థినుల మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే గుణం, లక్ష్య సాధనకు కష్టపడే తత్వం క్రీడల ద్వారానే అలవడుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని బాలికలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ జిల్లా స్థాయి బాలికల స్పోర్ట్స్, సాంస్కృతిక పోటీలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణకు నిలువెత్తు ఉదాహరణలని అన్నారు. మైదానంలో చూపే పట్టుదల, ఆత్మవిశ్వాసం జీవిత సవాళ్లను ఎదుర్కొనే శక్తిని ఇస్తుందని పేర్కొన్నారు. అనంతరం అతిథులను అధికారులు శాలువాలతో సన్మానించారు. క్రీడాజ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. పరుగు పందెంలో గెలుపొందిన క్రీడాకారిణులకు పథకాలు అందించారు. ప్రారంభోత్సవంలో విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జాతీయ క్రీడాకారిణి నందిని, అదనపు కలెక్టర్లు శ్యామలదేవి, రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.



## మంచిర్యాల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ హస్తగతం చేయడమే లక్ష్యం

**- జిల్లాలో ఇన్చార్జి మంత్రి పర్యటన**

**- ప్రేమ్‌సాగర్‌రావుతో మంత్రి భేటీ**

**మంచిర్యాల, జనవరి 28, ప్రభాతవార్త**

ఎన్నికల ప్రచారం ముమ్మరమైంది. తెలంగాణ పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృుతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నివాసానికి వెళ్లారు. ప్రేమ్ సాగర్ రావు, కాంగ్రెస్ నాయకులు మంత్రికి స్వాగతం పలికారు. ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల గురించి వీరు చర్చించారు. మంచిర్యాల కార్పొరేషన్‌లోని 60 డివిజన్లు, లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని 15 కౌన్సిలర్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని నేతలు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా ఇన్చార్జి మంత్రితో స్థానిక శాసనసభ్యుడు మాటామంతి

## ఎస్ఎంఏఎం పథకం ద్వారా మండలానికి వ్యవసాయ యంత్రాల కేటాయింపు - ఏఓ

**చింతలమనేపల్లి, జనవరి 28, ప్రభాతవార్త:**

ఎస్ఎంఏఎం (సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకానైజేషన్) పథకం కింద చింతలమనేపల్లి మండలానికి వివిధ వ్యవసాయ యంత్రాలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి కార్తెషా తెలిపారు. రైతుల సాగు పనులు సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. మంజూరైన యంత్రాల్లో బ్యాటరీ స్ప్రేయర్లు 177, పవన్ స్ప్రేయర్లు 31, రోటవేటర్లు 12, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్లులు 2, కల్టివేటర్లు 13, పవర్ వీడర్ 1, బ్రష్ కట్టర్లు 2, పవర్ టిల్లర్లు 2 ఉన్నాయి. లబ్ధి పొందదలచిన రైతులు అప్లికేషన్ ఫారం, పట్టా పాస్‌బుక్, ఆధార్ కార్డు, ఫోటోలతో మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. ట్రాక్టర్ పనిముట్లకు దరఖాస్తు చేసే రైతులు ఆర్‌సీ జత చేయాలని సూచించారు.

## మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

**- బిఆర్ఎస్ ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరిక**



**లక్షెట్టిపేట, జనవరి 28, ప్రభాతవార్త**

మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరడమే లక్ష్యంగా, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ సమక్షంలో బిఆర్ఎస్ ముఖ్య నాయకులు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని మోదెల కు చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్, మాజీ మండల ఉపాధ్యక్షులు, లక్షెట్టిపేట పట్టణ అధ్యక్షులు పాదం శ్రీనివాస్, మాజీ జడ్పిటిసి, ఎంపీటీసీ, మాజీ సర్పంచ్, మాజీ కౌన్సిలర్ చాతరాజు రాజన్న, మోదెల 6వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షులు గోళ్ళ మనోహర్, మోదెల 6వ వార్డు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి దొమ్మటి సత్యనారాయణ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు చేసే అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరేయడమే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.



# మాత జన్మనిస్తే..
# మాత 'హాస్పిటల్' పునర్జన్మనిస్తుంది!

❖ అత్యాధునిక యంత్రాల ద్వారా చికిత్స ❖ సహేతుకమైన ఖర్చులతో వైద్యం
❖ నవజాత శిశువుల నుంచి చిన్నారుల వరకు సమగ్ర సేవలు
❖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మోటం శ్రీశైలంతో ప్రత్యేక ఇంటర్వ్యూ



మంచిర్యాల, జనవరి 28, ప్రభాతవార్త

**జిల్లా కేంద్రంలోని పిల్లల వైద్య సేవలకు మాత చిల్డ్రన్ హాస్పిటల్ ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. నెలలు నిండని చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తూ తల్లిదండ్రులకు వరప్రదాయంగా మారింది. మాత జన్మను ఇస్తే.. మాత హాస్పిటల్ పునర్జన్మనిస్తుంది అని ఇక్కడ చికిత్స పొందిన పిల్లల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఈ ఆస్పత్రికి మంచిర్యాల జిల్లా వాసులే కాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుండి, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుండి కూడా రోగులు వస్తుంటారు. మాత ఆసుపత్రి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మోటం శ్రీశైలంతో ప్రభాతవార్త ప్రత్యేక ఇంటర్వ్యూ..**

డాక్టర్ మోటం శ్రీశైలం సొంత ఊరు మంచిర్యాల జిల్లా నస్పూర్. తండ్రి వ్యాపారి, తల్లి గృహిణి. నలుగురు సంతానంలో ప్రథముడైన శ్రీశైలం నస్పూర్ లో పాఠశాల విద్యను, కరీంనగర్‌లో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అనంతరం నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి చండీగఢ్‌లోని ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో పీజీ (పిల్లల వైద్య నిపుణులు) పూర్తి చేశారు. మహానగరాలలో అవకాశాలు ఉన్నప్పటికీ, సొంత ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చుతో సేవ చేయాలనే సంకల్పంతో 2019లో మంచిర్యాలలో ఆసుపత్రి స్థాపించారు. డాక్టర్ శ్రీశైలం సతీమణి కూడా వైద్య నిపుణురాలిగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిలో సేవలందిస్తున్నారు.






## అధునాతన చికిత్స యంత్రాంగం:

ఆసుపత్రిలో అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉంది. నియోనెటాల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్, హై ఫ్రీక్వెన్సీ కన్వెన్షన్ వెంటిలేటర్, సిప్యాప్, బైప్యాప్, ఏబీజీ అనలైజర్ సౌకర్యం, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్, పీడియాట్రిక్ సర్జరీ, సూపర్ స్పెషాలిటీ సేవలు, ల్యాబ్, మెడికల్ షాప్ వసతులు ఉన్నాయి.

## ఆరోగ్య బీమా సదుపాయం:

నగదు రహిత చికిత్స కోసం సుమారు 25 నెట్‌వర్క్ బీమా పాలసీలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులకు ఫీజు రియంబర్స్మెంట్ సౌకర్యం కల్పించారు. నవజాత శిశువుల నుంచి చిన్నపిల్లల వరకు జ్వరాలు, శ్వాసకోశ సమస్యలు, పోషక లోపాలు వంటి అన్ని రకాల సమస్యలకు ఇక్కడ పరిష్కారం లభిస్తుంది. డాక్టర్ శ్రీశైలం పిల్లలతో స్నేహ పూర్వకంగా ఉంటూ, తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేస్తూ భరోసా కల్పిస్తున్నారు. హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, అదే స్థాయి వైద్యం ఇక్కడ అందుతుండటంతో మాత చిల్డ్రన్ హాస్పిటల్ జిల్లాలో ముందంజలో నిలుస్తోంది.







# మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, జనవరి 28, ప్రభాతవార్త

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశానికి ఎస్పి నితికా పంత్, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 28 నుండి 30వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 31వ తేదీన నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 1వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, 9వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి ప్రచారం నిలుపుదల, 11వ తేదీన పోలింగ్, 13వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులకు 28 పోలింగ్ కేంద్రాలు, కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని 30 వార్డులకు 85 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి 2 స్టాటిస్టిక్, 1 ఫ్లయింగ్ సర్వేయలెన్స్ బృందాలు, కాగజ్ నగర్ మున్సిపాలిటీకి 2 స్టాటిస్టిక్, 1 ఫ్లయింగ్ సర్వేయలెన్స్ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. నామినేషన్లు స్వీకరించేందుకు రిటర్నింగ్ అధికారులను నియమించడం జరిగిందని, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ప్రశాంతంగా జరిగేలా కలెక్టరేట్ భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 8500844365 నెంబర్ 24 గంటల పాటు పనిచేస్తుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు, ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు, ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని, నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో వీడియోగ్రఫీ ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నాను తెలిపారు. జిల్లా ఎస్పి. మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు బందోబస్తు పూర్తి ఏర్పాట్లు, పోలింగ్ ముందు, పోలింగ్ రోజు, కౌంటింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 30 పోలీస్ ఆక్ట్ అమలు చేయడం జరుగుతుందని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా చర్యలు తీసుకుంటామని, సమస్యాత్మక ప్రాంతాలలో పోలీస్ ఫ్లాగ్ మార్చ్ చేపడతామని తెలిపారు. నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, ర్యాలీలు, సబల అనుమతుల కొరకు 48 గంటల ముందే దరఖాస్తు చేసుకోవాలని, ప్రచారంలో వినియోగించే లౌడ్ స్పీకర్లకు ఎస్డిపిఓల వద్ద అనుమతి పొందాలని తెలిపారు. లైసెన్సుడ్ ఆయుధాలు కలిగిన వారు తిరిగి డిపాజిట్ చేయాలని, ఇతర వివరాలకు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ పోలీస్ శాఖ నెంబర్ 8712670505 లో సంప్రదించాలని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పూర్తి స్థాయి బందోబస్తు ఏర్పాటు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, పాత్రికేయులు పాల్గొన్నారు.



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హరిత




## మున్సిపల్ ఎన్నికలలో సిపిఐ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీ తో గెలిపించాలి

### - రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేన శంకర్

రామకృష్ణాపూర్, జనవరి 28, ప్రభాతవార్త

మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ పార్టీ అన్ని వార్డులలో పోటీ చేస్తుందని, సిపిఐ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్ముణ్‌లు అన్నారు. బుధవారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయం లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు ధర్మం ఉన్నప్పటికీ స్థానిక ఎన్నికల్లో మిత్ర ధర్మాన్ని పాటించాలని కోరారు. మిత్ర ధర్మాన్ని విస్మరిస్తే కలిసి వచ్చే సెక్యూలర్ పార్టీలతో సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డులలో నామినేషన్ వేయాలని చెప్పారు. గతంలో ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీని ఆదరించి సర్పంచ్ ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రజలు ఆదరించి గెలిపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌల్, వనం సత్యనారాయణ,ఎగూడ మొండి, సిపిఐ నాయకులు మెరుగు రాజేశం, మద్దెల శంకర్, ముతుకుల రాజు, ఈరవేణి రవీందర్, కౌడగాని సాంబయ్య, మాదాసు శంకర్, సంకె లక్ష్ముణ్, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

# జాతరలో వైద్య శిబిరం ప్రారంభించిన జిల్లా వైద్యాధికారి

మంచిర్యాల, జనవరి 28, ప్రభాతవార్త




జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ అనిత బుధవారం మంచిర్యాల్ గోదావరి ఘాట్ లోని సమ్మక్క సారలమ్మను సందర్శించి 24 గంటల పాటు అందుబాటులో ఉండే వైద్య శిబిరంను ప్రారంభించి తదనంతరం మాట్లాడుతూ వైద్యులు ఆర్బీఎస్కె సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు, 108 అంబులెన్స్ సర్వీసులు, అత్యవసర సేవలు సమ్మక్క సారాలమ్మ దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు వైద్య ఆరోగ్యశాఖ తరపునుండి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలియజేసినారు. అదేవిధంగా జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ ద్వారా జాతరలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యంగా మంచినీటినిపై పరిశుభ్రమైన నీటిని తీసుకొనడం తినే ఆహార పదార్థాల పైన దుమ్ము దులివాలకుండా చూసుకొనడము, మలవిసర్జన బయట చేయకుండా జాగ్రత్తలు తెలియజేశారు. ఈగలు వాలకుండా పదార్థాల మూతలు పైన కప్పి ఉంచుకోవాలని అదేవిధంగా చిన్నపిల్లలు వృద్ధులు గర్భవతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, కోరారు ఈ కార్యక్రమంలో డిపిహెచ్ఎన్ ఆర్ఎస్ పద్మ, మార్తా వైద్యులు, వైద్య సిబ్బంది జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.



## బొక్కేవాగు పర్యాటక అభివృద్ధికి గ్రామసభ తీర్మానం

పెంచికల్ పేట్, జనవరి 28, ప్రభాతవార్త :

పెంచికల్ పేట్ మండలం ఎల్లూర్ గ్రామంలోని బొక్కేవాగు ప్రాజెక్టు ప్రాంతాన్ని పక్షుల నివాస కేంద్రంగా, పర్యాటక అభివృద్ధికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్పంచ్ చప్పిడి రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. పక్షులకు అనుకూలమైన వెట్ ల్యాండ్ భూభాగాన్ని అటవీశాఖకు అప్పగిస్తూ గ్రామసభ తీర్మానం చేశారు. పర్యాటక అభివృద్ధిపై ఉన్నత అధికారులకు నివేదిక పంపుతామని అటవీశాఖ రేంజ్ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చంద్రయ్య, పారెస్ట్ అధికారులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

లింగాపూర్, జనవరి 28, ప్రభాతవార్త :

లింగాపూర్ మండలంలోని జాములాదరా గ్రామపంచాయతీ ప్రజలకు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రయోజనాల గురించి అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లింగాపూర్ బ్రాంచ్ మేనేజర్ ముకేశ్ మాట్లాడుతూ ,ప్రతి ఒక్కరు 18 సంవత్సరాలు నిండిన వారు అకౌంట్ కలిగి ఉండాలి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అనేది నా బార్డ్ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక ప్రయోజనాల కోసం నిర్వహించడం జరుగుతుంది, రైతులు మహిళా సంఘ సభ్యులు ప్రతి ఒక్కరూ సకాలంలో రుణాలు తీసుకుని వ్యవసాయ,వ్యాపార అవసరాలు తీర్చుకొని సకాలంలో రుణాలు చెల్లించి బ్యాంకు ప్రయోజనాలను పొందగలరని తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు సామాజిక భద్రత పథకాలు. ప్రధానమంత్రి జీవిత భీమ 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయసుగల వారు 436 వార్షిక చెందతో రెండు లక్షలు జీవిత బీమా కల్పించడం జరుగుతుంది అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన 18 నుండి 70 సంవత్సరాల వయసుగల వారు ..20 వార్షిక చెందతో రెండు లక్షల ప్రమాద బీమా కల్పించడం జరుగుతుంది .అటల్ పింఛన్ యోజన వంటి పథకాల ప్రయోజనాలు పొందాలి. తెలంగాణ గ్రామీణ బ్యాంకు మీ బ్యాంకు రైతుల మహిళా సంఘాల గ్రామీణ ప్రాంత ప్రజల అభివృద్ధి పరిచే బ్యాంకు అని తెలిపారు, ప్రతి ఖతదారుడు అవసరానికి మించి ఖర్చు చేయకుండా భావితరాల కోసం వారి యోగ క్షమాల కోసం పొదుపుని అలవాటు చేసుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాములదార గ్రామపంచాయతీ ప్రజలు మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న బ్రాంచ్ మేనేజర్ ముఖేష్

## నామినేషన్ల స్వీకరణల పరిశీలన

ఆసిఫాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణలో భాగంగా రాష్ట్ర ఎన్నికల ఎక్సపెన్డిచర్ అబ్జర్వర్ దేవేందర్ప రిశీలించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో జరుగుతున్న ప్రక్రియను జిల్లా ఎక్స్పెండిచర్ నోడల్ ఆఫీసర్ అబ్దుల్ నదీమ్ కద్దిసితో కలిసి పరిశీలించారు. ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్లు స్వీకరించాలని సిబ్బందికి సూచించారు.



పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల ఎక్సపెన్డిచర్ అబ్జర్వర్ దేవేందర్

# వన్యప్రాణులకు ఎలాంటి హాని చేయకూడదు

**ఆసిఫాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:**

జిల్లాలోని వన్యప్రాణులకు ఎలాంటి హాని చేయకూడదని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులతో వన్యప్రాణి చట్టంపై నిర్వహించిన వర్క్ షాప్ కార్యక్రమానికి ఎస్పి నితికా పంత్, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, కాగజ్ నగర్ డివిజన్ అటవీ అధికారి అప్పయ్య లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పశువులు, జంతువులు పశుగ్రాసం కొరకు అడవి మధ్యలోకి వెళ్లడం వలన వన్యప్రాణుల దాడికి గురవుతున్నాయని, వాటి పశుగ్రాసం కొరకు అటవీశాఖ, గ్రామీణ అభివృద్ధి, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో అటవీ భూమిలో పశుగ్రాసం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ లైన్ కు విద్యుత్ తీగలను అమర్చడం ద్వారా అటవీ జంతువులే కాకుండా రైతులు మృతి చెందిన సందర్భాలు ఉన్నాయని, ఈ ప్రమాదాలను నివారించాలని తెలిపారు. జిల్లాలోని భూభాగంలో 54 శాతం అడవి విస్తరించి ఉందని, ఈ ప్రాంతాన్ని రక్షించుకోవడం బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ వైల్డ్ లైఫ్ టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తామని, వన్యప్రాణి వేట, స్మగ్లింగ్ జరగకుండా అటవీశాఖ, పోలీస్ శాఖల సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వన్యప్రాణి చట్టంపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, ఉద్యానవన అధికారి నదీమ్, పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్, విద్యుత్ శాఖ ఎస్. ఈ. జాడే ఉత్తం, తహసిల్దార్లు, అటవీ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె. హరిత


పోటీలను ప్రారంభించిన ఎంపీడీవో శ్రీనివాస్

## అట్టహాసంగా సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు

**తాండూర్, జనవరి 28 ప్రభాతవార్త :**

తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను ఎంపీడీవో శ్రీనివాస్ ప్రారంభించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల నుండి దాదాపు 520 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ కేటగిరీల వారిగా కబడ్డీ, ఖోఖో , వాలీబాల్, హ్యాండ్ బాల్ , చెస్, క్యారమ్స్, , అథ్లెటిక్స్, మొదలవు క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ అనిల్ కుమార్, ఎస్సై సౌజన్య, సూపరింటెండెంట్ వేణుగోపాలరావు , సర్పంచ్ సురేష్, కార్యదర్శి దివాకర్, పిడీలు సాంబమూర్తి, పద్మజ , సంతోష్, మల్లేష్, బాలకిషన్, స్వప్న, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సుధాకర్, కోమల, తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్

## సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

**తాండూర్, జనవరి 28, ప్రభాతవార్త :**

మండలంలోని అచ్చలాపూర్ గ్రామానికి చెందిన కొక్కుముంటి గంగయ్యకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి రూ.60 వేలు చెక్కును బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మారుశెట్టి శ్రీనివాస్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గడ్డం వినోద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గట్టు మురళీధరరావు కృషి వల్ల సీఎం సహాయనిధి మంజూరు అయిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండు శ్రీనివాస్, పూదరి కిష్ట గౌడ్, పొట్లపల్లి రామయ్య, కుంచ వెంకటి, దాగం పోచయ్య, దాగం పాపయ్య, బండి పోశం, పొట్లపల్లి శంకర్, పొట్లపల్లి రమేష్, పెద్దపెల్లి మల్లేష్, పుప్పాల రమేష్, చిట్ల రమేష్, దుర్గం రామకృష్ణ, కూస వెంకటి, పొట్లపల్లి రాయమల్లు, చీర్ల శంకర్, మైదం పెంటయ్య, వారిమడ్ల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



## మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆరెగూడ క్యాలెండర్ ఆవిష్కరణ

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 28, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆరెగూడ క్యాలెండర్‌ను బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ పెట్రోల్ పంప్‌లో శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ బిట్టు మల్లేశం ఆధ్వర్యంలో, మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ఆరెగూడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి. చంద్రశేఖర్, జిల్లా పరిషత్ హై స్కూల్ పెట్రోల్ పంప్ ప్రధానోపాధ్యాయులు వెంకట రాజం, జిల్లా పరిషత్ హై స్కూల్ బాయ్స్ ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆరెగూడ ప్రధానోపాధ్యాయులు కొమ్ము లక్ష్మినారాయణ, పానెల్ ఇన్స్పెక్షన్ టీం లీడర్ నారాయణ, సంతోష్, ఉపాధ్యాయులు జిత్తు నాయక్, రౌతు రవి,జిల్లా పరిషత్ హై స్కూల్ పెట్రోల్ పంప్ శీను, ఉపాధ్యాయులు శ్యాంసుందర్ అనీష్ హైమద్, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీలు సంపూర్ణ సహకారం అందించాలి

**ఆసిఫాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:**

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి హరిత పేర్కొన్నారు. బుదవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ నితిక పంత్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వరరావుతో కలిసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. బుధవారం నుండి నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయడంతో పాటు, నామినేషన్ కేంద్రాల వద్ద హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు నిరంతరం విధులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. మున్సిపాలిటీలో ఓటింగ్ శాతం పెంచే దిశగా చర్యలు చేపట్టడంతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కంట్రోల్ రూమ్ నెంబర్ 8500844365 ద్వారా ఫిర్యాదులు, సమస్యలను తెలియజేయవచ్చని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ నీతిక పంత్ మాట్లాడుతూ, పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ అనంతరం, అలాగే కౌంటింగ్ రోజున పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నేరచరిత్ర కలిగిన వారిపై బైండోవర్ చర్యలు చేపడతామని, ఓటర్లకు భద్రతా ముప్పు కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. పోలీస్ హెల్ప్‌లైన్ నెంబర్ 871267050 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హరిత


సమ్మక్కను దర్శించుకున్న అధికారులు

## సమ్మక్క జాతర ప్రారంభం

**తాండూర్, జనవరి, ప్రభాతవార్త**

మండలంలోని తాండూర్ గ్రామ పంచాయతీలో గల కర్నెలఘట్టం వద్ద బుధవారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన భక్తులు, మహిళలు సమ్మక్క సారలమ్మ గద్దెలను సందర్శించి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్ఐ సౌజన్య, తాండూర్ సర్పంచ్ ముడిమడుగు సురేష్, నాయకులు అమ్మవారి దర్శించుకున్నారు.

## మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే

**ఆసిఫాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:**

సమ్మక్క సారక్క వద్ద ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్షి ్మ మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం ఆసిఫాబాద్ మండలం బూరుగుడ గ్రామ సమీపంలో వెలసిన సమ్మక్క సారక్క గద్దల వద్ద ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఇంటి నుండి డప్పు చప్పుళ్లతో, మంగళవాయిద్యాల మధ్య కోలాహలంగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్లకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి భక్తి చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు మర్సకోల సరస్వతి, గుండి సర్పంచ్ రవీందర్, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, మాజీ సర్పంచ్ బలరాం, పొన్నాల నారాయణ, ప్రేమ్, సురేష్, సుప్రజ, సంగీత, ఉమ, లలిత తదితరులు పాల్గొన్నారు.


సమ్మక్కసారక్కల దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఆధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్

## కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

### - రాష్ట్ర ఆధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్

**నేరడిగొండ, జనవరి 28, ప్రభాతవార్త:**

కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రాష్ట్ర ఆధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పదవ తరగతి విద్యార్థులకు సూచించారు. నేరడిగొండ మండలం వడూర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో వడూర్, తేజాపూర్, నేరడిగొండ ప్రాంతాల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు మోటివేషనల్, కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. లింగన్న సహకారంతో, వడూర్ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు బూమారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన బలరాం జాదవ్ మాట్లాడుతూ రాబోయే బోర్డ్ పరీక్షలకు ప్రణాళికబద్ధంగా సిద్ధమై మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే విద్యార్థులకు తనవంతు సహాయ సహకారాలు, ప్రోత్సాహకాలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి భూమా రెడ్డి, వడూర్ సర్పంచ్ శ్రీకాంత్, స్పీకర్స్ గుడిసెల రమణ గౌడ్, అల్లం సాయి, నరేష్ పాల్గొన్నారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు హాజరయ్యారు.

## నేడే మండల స్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం

**సారంగాపూర్, జనవరి28, ప్రభాతవార్త:**

ఈ నెల 29 నుండి మండల స్థాయి సీఎం కప్ పోటీలు మండల కేంద్రంలోని తెలంగాణ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మి కాంత్, మండల విద్యాధికారి మహేందర్ పేర్కొన్నారు. సీఎం కప్ నిర్వహణకు సంబంధించిన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, అథ్లెటిక్స్ కు సంబంధించిన క్లస్టర్ స్థాయి నుండి మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులందరూ, ఉదయం 8 గంటలకు తెలంగాణ క్రీడ ప్రాంగణంలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అజీజ్ ఖాన్, ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్

**సిరికొండ, జనవరి 28, ప్రభాతవార్త:**

సిరికొండ కొండాపూర్ గ్రామానికి చెందిన గుగ్గిళ్ళ దీపాబాయి భర్త పేరు హనుమంతు ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు ఇల్లు కట్టడానికి వాయిపేట్ నుండి కొండాపూర్‌కు ట్రాక్టర్ నెంబర్ టిజి01ఎ3812లో తాసిల్దార్ అనుమతితో ఇసుకను తీసుకెళ్తడానికి అనుమతిని ఇచ్చారు. అయితే సిరికొండ ఎస్సై పూజ ఫిర్యాదు మేరకు వాహనాలను తనిఖీ చేస్తుండగా ట్రాక్టర్ నెంబర్ టిఎస్01యూఏ9359, టిఎస్01యూఏ7063 అనే నెంబర్ గల రెండు ట్రాక్టర్లను ఆపి చూడగా వేరే టాక్టర్ నెంబర్‌ను ఫోర్జరీ చేసి ఇసుకను తీసుకెళ్తున్నారు. వారిని ప్రశ్నించి ఆ పత్రాలను తాసిల్దారుకు వాట్సాప్‌లో పంపించగా ఫోర్జర్ చేశారని నిర్ధారణ కావడంతో బాధితుల ఫిర్యాదు మేరకు సిరికొండ గ్రామానికి చెందిన ఇద్దరు ట్రాక్టర్ యజమానులపై సిరికొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు. ఇచ్చోడ సీఐ దర్యాప్తు చేపట్టి బుధవారం వారి వద్ద నుండి ఫోర్జరీ చేసిన పత్రాలను ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్ చేసి కోర్టుకు పంపారు.

# నిబంధనలకు లోబడి నామినేషన్ల ప్రక్రియ చేపట్టాలి

### - మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**రామకృష్ణాపూర్, జనవరి 28, ప్రభాతవార్త**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నామినేషన్ల ప్రక్రియ చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని ఏర్పాటుచేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ప్రత్యేక అధికారి, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులకు సంబంధించి అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలోగా స్వీకరించాలని, 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఉన్నవారి నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారి నుండి స్వీకరించడం జరగదని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కొరకు టేబుళ్ల ఏర్పాటు చేయడం జరిగిందని, 100 మీటర్ల నిబంధన అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి



11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపల్

## క్యాట్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

### - విద్యార్థులకు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేత

**మందమర్రి, జనవరి 28, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు క్యాట్ లెవెల్ 2 మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగంలోని పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎం. రమేష్ మాట్లాడుతూ మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగంలో 43 మంది విద్యార్థులు అర్హత సాధించి, 7 గురు విద్యార్థులు1000 రూపాయల నగదు బహుమతితో పాటు మెడల్, మెరిట్ సర్టిఫికెట్ అర్హత సాధించారు, 25 మంది మెడల్, మెరిట్ సర్టిఫికెట్, 11 మంది మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారని తెలిపారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎం. రమేష్, డీన్ రవి చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. వీరిని పాఠశాల యాజమాన్యం డైరెక్టర్ శ్రీవిద్య, చైర్మన్ మల్లంపల్లి శ్రీధర్, ఏజీఎం అరవింద్ రెడ్డి, కో ఆర్డినేటర్ నాగరాజులు అభినందించారు. ఈ కార్యక్రమంలో క్యాట్ ఇంచార్జి శ్యామల, వీరేంద్ర కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి సర్కారు హామీ

### - ఐటీ మాఫీ, మెడికల్ బోర్డు పునరుద్ధరణపై జనక్ ప్రసాద్ విజ్ఞప్తి

**నస్పూర్, జనవరి 28, ప్రభాతవార్త**

సింగరేణి కార్మికుల చిరకాల స్వప్నాన్ని త్వరలోనే సాకారం చేస్తామని మినిమమ్ వెజ్ బోర్డ్ చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ వెల్లడించారు. సింగరేణి కార్మికుల న్యాయమైన హక్కులు, పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలను ఇటీవల ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కార్మికులు ఎదుర్కొంటున్న నాలుగు ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం మంత్రివర్గానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక కమిటీని నియమిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. కార్మికుల పెర్క్స్ పై విధిస్తున్న ఆదాయపు పన్నును పూర్తిగా మాఫీ చేయాలి. లేదంటే ఆ మొత్తాన్ని కార్మికులకు రీయింబర్స్‌మెంట్ రూపంలో తిరిగి చెల్లించాలి. మెడికల్ బోర్డును పునరుద్ధరించి 95 శాతం వరకు మెడికల్ ఇన్వాలిడేషన్ సదుపాయం కల్పించాలని విన్నవించారు. ఉద్యోగుల పేర్ల మార్పులకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని మంత్రివర్గానికి వివరించారు. ఈ డిమాండ్ల సాధన ద్వారా కార్మికులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తున్న జనక్ ప్రసాద్‌ను టీపీసీసీ నాయకుడు పెర్క శ్యామ్, ఐఎన్టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు కలిసి సన్మానించారు. జనక్ ప్రసాద్ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో సింగరేణి కార్మికుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం చేస్తున్న పోరాటం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ డివిజన్ ఐఎన్టీయూసీ ప్రతినిధులు పాల్గొన్నారు.



జనక్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న పెర్క శ్యామ్, జెట్టి శంకర్ రావు

## ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిని సన్మానించిన అంబేద్కర్ సంఘం నాయకులు



**జన్నారం, జనవరి 28, ప్రభాతవార్త**

ఇటీవల నూతనంగా మంచిర్యాల జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా బాధ్యలు చేపట్టిన దమ్మ నారాయణ బుధవారం జన్నారం మండలానికి వచ్చిన సందర్భంగా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు సిటిమల భరత్ కుమార్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి, మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధర్భంగా దమ్మ నారాయణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అండగా నిలబడి వారి హక్కుల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘం నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, మామిడిపెల్లి ఇందయ్య, గుగ్లావత్ రవి నాయక్, దుమల్ల రమేష్, కొండుకూరి ప్రభుధాస్, మేకల మాణిక్యం, మేకల అక్షయ్ కుమార్, జంగం రవి, దుమల్ల ప్రవీణ్, కొండుకూరి రాజు, కుంద నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమల్లోకి: కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2026 సంవత్సరానికి గాను మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల 2వ సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమల్లోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ. రాణి కుముదిని జారీ చేసిన నోటిఫికేషన్‌తో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. జనవరి 28 నుండి ఉదయం 10:30 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై, జనవరి 30 సాయంత్రం 5:00 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. నామినేషన్ల పరిశీలన జనవరి 31న, అప్పీళ్లకు ఫిబ్రవరి 1 వరకు అవకాశం ఉందని, ఉపసంహరణకు ఫిబ్రవరి 3 మధ్యాహ్నం 3:00 గంటల వరకు గడువు విధించామని వివరించారు. పోలింగ్ ఫిబ్రవరి 11న ఉదయం 7:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జరుగుతుందని, ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 13న చేపడతామని తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, డిపిఆర్ఓ ఇ. విష్ణువర్ధన్, మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.





## బొమ్మల ఆధారిత బోధనపై శిక్షణ ప్రారంభం

**అదిలాబాద్, జనవరి 28, ప్రభాతవార్త:**

ఉమ్మడి జిల్లాల పరిధిలోని పీఎం శ్రీ పాఠశాలల ఉపాధ్యాయులకు బొమ్మల ఆధారిత బోధనపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం జిల్లా విద్యా శిక్షణ సంస్థ అదిలాబాద్‌లో నిర్వహించారు. ఈ శిక్షణ జనవరి 28 నుంచి 31 వరకు కొనసానుంది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్‌గా మునేశ్వర్ విజయ్ కుమార్ అదిలాబాద్, ఎల్లన్న నిర్మల్, సురేష్ మంచిర్యాల, వెంకటేష్ కేబీ ఆసిఫాబాద్ పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బోధనను మరింత ఆసక్తికరంగా, ప్రభావవంతంగా మార్చడమే ఈ శిక్షణ లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. బొమ్మలు, ఆటల ఆధారిత బోధన ద్వారా పిల్లల అభిజ్ఞా, శారీరక, సామాజిక, భావోద్వేగ నైపుణ్యాలు సమగ్రంగా అభివృద్ధి చెందుతాయని వివరించారు. తెలుగు, ఆంగ్లం, గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో ఆచరణాత్మక అభ్యాసానికి అవకాశం కల్పించడం వల్ల భావనాత్మక అవగాహన పెరుగుతుందని తెలిపారు. సమూహ ఆటల ద్వారా సహకారం, కమ్యూనికేషన్ వంటి నైపుణ్యాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఆహెద్, డైట్ అదిలాబాద్ ప్రిన్సిపాల్, డాక్టర్ కిరణ్ కుమార్ ఐసీ ప్రిన్సిపాల్, అజయ్ ఏఎంఓ, నాందేవ్ అసిస్టెంట్ ఏఎంఓతో పాటు వివిధ జిల్లాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వనం నుంచి జనంలోకి సారలమ్మ

### - అరటిపల్లిలో ప్రారంభమైన సమ్మక్క సారలమ్మ జాతర

**తిర్యాని, జనవరి 28, ప్రభాతవార్త:**

తిర్యాని మండలంలోని కన్నెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల అరటిపల్లి స్టేజి వద్ద సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాలు బుధవారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. వనం నుండి సారలమ్మ తల్లి జనంలోకి విచ్చేసి గద్దెనెక్కిన ఘట్టం ఆధ్యాత్మిక కోలాహలాన్ని నింపింది. పూజారులు బొమ్మగోని సత్యగౌడ్, కరిగంటి బాపు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య అత్యంత వైభవంగా గద్దెపైకి తీసుకువచ్చారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తిర్యాని ఎస్సై సెగ్గం వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. అమ్మవారిని గద్దెపైకి తీసుకువచ్చే సమయంలో తోపులాట జరగకుండా ఎస్సై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో అరటిపల్లి పరిసర ప్రాంతాలన్నీ జనసంద్రంగా మారాయి.



## బంగారు కానుకలతో అమ్మవార్లకు భక్తుల మొక్కులు

**పెంచికల్ పేట్, ప్రభాతవార్త :**

మండలంలోని పెంచికల్ పేట్ గ్రామంలో నిర్వహిస్తున్న గిరిజన ఆరాధ్య దేవతలైన సమ్మక్క సారలమ్మల జాతర తొలి రోజైన బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. పూజారి కుమ్మరి దుర్గమ్మ సారక్కను గద్దెపై కొలువుదీరించారు. ఈ సందర్భంగా జాతర వ్యవస్థాపకులు కీ౹౹ శే గణపురం శ్రీనివాస్ సోదరులు ప్రకాష్ పద్మ, రమేష్ స్వరూపలతో పాటు, కుటుంబ సభ్యులు, పలువురు భక్తులు అమ్మవార్లకు బంగారు కానుకలను సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నేడు గద్దెలపైకి సమ్మక్క ఆగమనంతో మహా జాతర జరగనున్నట్లు జాతర నిర్వహణ కమిటీల అధ్యక్షులు తెలిపారు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చప్పిడి రవీందర్, భక్త రాంచందర్, మాజీ జెడ్పిటిసిలు సముద్రాల సరితరాజన్న, చిలువేరు సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం పట్టణ మాజీ అధ్యక్షులు మురళి, మాజీ సర్పంచ్ కుకీడే రాజేష్, ఆరేకుల సంఘం తాలూకా అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ నిర్వహణ కమిటీ అధ్యక్షులు నందు, శ్రీరామ, శ్రీ సాయి, ఆర్యవైశ్య సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



## సమ్మక్క సారలమ్మ జాతరలో వైద్య సేవలు

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 28, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలంలోని నందిగూడ పెద్దవాగు పంప్ హౌజ్ వద్ద నిర్వహిస్తున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం బట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్సి) ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు, సిబ్బంది భక్తులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారు. జ్వరాలు, తలనొప్పి, రక్తపోటు వంటి సాధారణ ఆరోగ్య సమస్యలతో పాటు గాయాల చికిత్స, ప్రాథమిక వైద్యం అందిస్తున్నారు. అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. భారీగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలుగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వైద్య అధికారులు తెలిపారు. జాతర ప్రాంగణంలో ఆరోగ్య సమస్యలు ఎదురైన భక్తులు వెంటనే వైద్య శిబిరాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రతీ రోజు రెండు షిఫ్టులు ఉదయం మధ్యాహ్నం శిబిరంలో విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం మొదటి షిఫ్టులో ఎంఎల్ఎస్‌పి కళ్యాణ్, ఏఎన్ఎం పద్మ, ఆశా వర్కర్లు, పీహెచ్ఎన్ రుతుక్లార, సీహెచ్ఓ మహాలక్ష్మి, రెండ షిఫ్టులో మధ్యాహ్నం హెచ్ఈఓ నరేష్, ఏఎన్ఎం లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ యువరాజు, సిబ్బంది భక్తులకు వైద్య సేవలు అందిస్తున్నారు.